పంట కోతలకు శ్రీకారం

- వరి, అపరాల పంట కోతలు ప్రారంభం
- వాతావరణ మార్పులతో వడివడిగా ఒబ్బిడి చేస్తున్న రైతులు
- 8,700 ఎకరాల్లో వరి సాగు


బెండపూడిలో మెషీన్‌తో వరికోతలు


ఎ.కొత్తపల్లిలో అపరాల పంటను ఒబ్బిడి చేస్తున్న రైతులు

తొండంగి: మండలంలో రైతులు రబీ వరికోతలకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది పీబీసీ, పంపా ఆయకట్టు ప్రాంతాల్లో కలిపి 6,700 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. మరో రెండు వేల ఎకరాల్లో వ్యవసాయ బోర్లు పరిధిలో రైతులు వరిసాగు చేశారు. సాగునీటి వనరులు అందుబాటులో ఉండటంతో వ్యవసాయ బోర్ల పరిధిలో రైతులు ముందుగానే నాట్లు వేశారు. పీబీసీ, పంపా ఆయకట్టు ప్రాంతాల్లో ఆలస్యంగా వరినాట్లు వేయడంతో ప్రస్తుతం ఆ చేలు పొట్ట, ఈనుక దశలో ఉన్నాయి. వ్యవసాయ బోర్లు పరిధిలో వరిచేలు ఇప్పటికే పక్వానికి రావడంతో బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, కొమ్మనాపల్లి, ఎ.కొత్తపల్లి, రావికంపాడు, పి.అగ్రహారం, గోపాలపట్నం తదితర ప్రాంతాల్లో కోత దశలో ఉన్నాయి. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడుతున్నాయి. కొద్దిరోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో పంట కోత దశకు చేరిన రైతుల్లో ఆందోళన మొదలైంది. దీంతో ఆదరాబాదరాగా వరి కోత యంత్రాలతో పంటను కోయిస్తున్నారు.

పల్లానికి మేలు చేస్తున్న వర్షాలు

మండలంలోని పీబీసీ ఆయకట్టు పరిధిలో రైతులకు కొద్దిరోజులుగా సాగునీటి ఎద్దడి నెలకొంది. సమస్యను రైతులు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో కురిసిన అకాల వర్షాలు నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న పంటలకు ఊపిరి పోశాయి. అకాల వర్షాలతో పంటలకు మేలు జరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జోరుగా అపరాల ఒబ్బిడి పనులు

మండలంలో ఈ ఏడాది అపరాల సాగు కూడా ఆశాజనకంగానే ఉంది. మండల వ్యాప్తంగా పెసలు 1270 ఎకరాల్లోనూ, మినుములు 470 ఎకరాల్లోనూ రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఆయా పంటలు పక్వానికి రావడంతో రైతులు ఒబ్బిడి చేస్తున్నారు. పలు గ్రామాల్లో అపరాల పంట ఒబ్బిడి పనులు జోరుగా సాగుతున్నాయి.

వాతావరణ మార్పులతో ఇక్కట్లు



ఎ.కొత్తపల్లిలో మాకు ఉన్న 1.60 ఎకరాల్లో పెసర సాగు చేశాను. ప్రస్తుతం పంట పక్వానికి రావడంతో ఒబ్బిడి చేయాల్సి ఉంది. కొద్దిరోజులుగా వాతావరణం మారింది. అడపాదడపా చినుకులు పడడంతో పంట ఒబ్బిడికి ఇబ్బంది పడుతున్నాం. మరో పది రోజుల పాటు వాతావరణం అనుకూలిస్తే పంటలను ఒబ్బిడి చేసుకుంటాం.

– కంతా ఆనందరావు, రైతు, ఎ.కొత్తపల్లి

మూడు ఎకరాల్లో వరి సాగు



నేను మూడెకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. ప్రస్తుతం పంట కోత దశకు చేరింది. గత తొలకరిలో తుపాను కారణంగా పంట నష్టపోయాం. ఇప్పుడు రబీలో కూడా అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో మరోసారి పంట నష్టపోతామని భయమేస్తోంది. వాతావరణం అనుకూలిస్తే ఈ పంట చేతికి వస్తుంది.

– గొంపా గోవిందు, రైతు, కొమ్మనాపల్లి

వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబుకు సత్కారం


లింగంపర్తిలో దొరబాబును సన్మానిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, పార్టీ నాయకులు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన బెహరా దొరబాబును ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులి రామకృష్ణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ గొల్లపల్లి దొరబాబు తదితరులు ఘనంగా సన్మానించారు. లింగంపర్తిలో గురువారం ఎమ్మెల్సీ అనంతబాబును పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొరబాబు, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు, ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, బండారు పెదబాబు, పినిశెట్టి ప్రకాష్, మామిడి నరసింహమూర్తి, మదినే నూకరాజు, లొండ బాబు, శెట్టి సత్తిబాబు, దేవ లక్ష్మణ్, రాపా గుర్రాజు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రేపు రన్ ఫర్ జీసస్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

జగ్గంపేట: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న జగ్గంపేటలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించనున్నుట్టు వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్‌వెస్లీ తెలిపారు. గురువారం జగ్గంపేటలోని ఆయన స్వగృహంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. స్థానిక టీచర్స్ కాలనీలోని చర్చి వద్ద శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. క్రైస్తవులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జార్జిబాబు, ఫెలోషిప్ వైస్ ప్రెసిడెంట్ జగజ్జీవన్‌రామ్, మైనారిటీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ ఎస్.విజయరాజు, ఐ.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

సమభావం 'సమరసత' లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న జగన్నాథం

కిర్లంపూడి: సమభావం సమరసత సేవా ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం అన్నారు. మండలంలోని కృష్ణవరంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ సమాజంలో మనుషులు అంతా ఒక్కటేనన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, కొప్పన కోటేశ్వరరావు, యడాలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఉప్పలపాడులో యువతకు సూచనలిస్తున్న అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ

గండేపల్లి: ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లో అధికారులు పర్యటిస్తున్నారు. ప్రజలకు ఎన్నికల నిబంధనలు, ప్రవర్తనా నియమావళిపై అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని ఉప్పలపాడు, జెడ్.రాగంపేట పోలింగ్ కేంద్రాలను గురువారం అడిషనల్ ఎస్పీ కె.సత్యనారాయణ (ఏఆర్) సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎస్సై ఎస్.రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

మోటారు సైకిళ్ల తనిఖీ


పండ్రవాడ రోడ్డులో మోటారు సైకిల్‌ను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలలో నిబంధనలను పాటించాలనే ఆదేశాల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీలు చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యుడు కర్రి హరికృష్ణ సత్యారెడ్డి ఆధ్వర్యంలో పండ్రవాడ, పవర గ్రామాల పరిధిలో మోటారు సైకిళ్ల సైతం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివాహాలకు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లే వారు వెంట నగదు తీసుకొని వెళ్లే సమయంలో తగిన ఆధారాలు ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా నగదు, మద్యం వాహనాలలో ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యతో పాటు క్రీడా సామర్థ్యాలు కనబరచాలి


ర్యాలీ చేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

పెద్దాపురం: ప్రతి విద్యార్థి క్రీడలు, విద్యల్లో శక్తి సామర్థ్యాలను కనపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పెద్దాపురం గురుకుల పాఠశాల కన్వీనర్, ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ సీకేపీ అన్నారు. స్థానిక సుధా కాలనీ గురుకుల పాఠశాల విద్యార్థులచే గురువారం ఎనర్జీ ఎఫిషియెన్సీ, ఎనర్జీ కన్వర్షన్‌పై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ కనపర్చాలన్నారు. విద్య, క్రీడారంగంలో ఆసక్తిని కనపర్చుకుని ప్రతిభా పోటీల్లో తలపడాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

రామాలయంలో మంత్రి రాజా పూజలు


జగన్నాథపురం రామాలయంలో వైఎస్సార్ సీపీ నాయకులతో చర్చిస్తున్న మంత్రి రాజా


జగన్నాథపురంలో సీతారాములను దర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: మండలంలోని జగన్నాథపురంలో ఇటీవల నూతనంగా నిర్మించిన రామాలయాన్ని మంత్రి దాడిశెట్టి రాజా గురువారం సందర్శించారు. సీతారాముల విగ్రహాలను పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘనం విజయం సాధించాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి రామాలయంలో కొంత సమయం గడిపారు. తొలుత గణపతి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించే ముందు తూర్పు సెంటిమెంటుగా జగన్నాథపురంలో వినాయకుడు, సీతారాములను దరించినట్లు చెప్పారు. ప్రతిసారి ఎన్నికలకు ముందుకు ఈ గ్రామంలో దేవాలయాలను దర్శించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అంతకుముందు గ్రామానికి వచ్చిన మంత్రి రాజాకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ లాలం బాబ్జీ, ఏఎబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, సర్పంచ్ లెక్కల ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఇక్కట్లు

తొండంగి: వేసవి ప్రారంభం నుంచే భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నారు. ఎండలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మెట్ట ప్రాంతమైన తుని నియోజకవర్గంలో గురువారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఎండతో పాటు ఉక్కపోత మరింత ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం రహదారులన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని ఏవీ నగరం పీహెచ్‌సీ వైద్యుడు పి.రవికుమార్ సూచించారు.

రూ.4.31 లక్షల స్వాధీనం

ఏలేశ్వరం: ఎన్నికల విధుల్లో భాగంగా పట్టణంలో గురువారం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.4.31 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. జగ్గంపేట పరిసర గ్రామానికి చెందిన లోవరాజు అనే వ్యక్తి మోటారు బైక్‌పై బ్యాగ్‌లో నగదు తీసుకు వెళ్తున్నాడు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించగా ఎటువంటి ధ్రువీకరణ ప్రతాలు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత పత్రాలు చూపిస్తే నగదు తిరిగి ఇస్తామని తహసీల్దార్ రంగారావు, ఈఓపీఆర్డీ సూర్యనారాయణ తెలిపారు.

నేరేళ్లమ్మకు ప్రత్యేక పూజలు


తిరుమాలిలో నేరేళ్లమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న వరుపుల సూరిబాబు

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి గ్రామ దేవత నేరేళ్లమ్మ అమ్మవారికి గురువారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత, పీఏసీఎస్ అధ్యక్షుడు వరుపుల సూరిబాబు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంలో కలశ ప్రతిష్ఠలో భాగంగా ఆయన అమ్మవారికి, కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఓలేటి చంటిబాబు, పసల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం


ఉప్పంపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు

- ఆ పార్టీ ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు
- ఉప్పంపాలెం, పల్లపు చామవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

రౌతులపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని ఉప్పంపాలెం, పల్లపు చామవరం గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకూ అందించిన వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలించిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలన వచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా చలమలశెట్టి సునీల్‌ను, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేత వాసిరెడ్డి జమీలు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కరబాబు, డీసీసీబీ డైరెక్టర్ పులి మధు, సర్పంచులు యెనుముల కోటేశ్వరదొర, రాపర్తి రామకృష్ణ, సర్పం శ్రీనివాస్, కాకి నాని, రాయి ప్రసాద్, జిగిరెడ్డి సత్తిబాబు, సొసైటీ ప్రెసిడెంట్ రుత్తల సత్తిబాబు, నాయకులు గిరి, యెనుమల క్రాంతి, పదిలం వరహాలు బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహాకుంభాభిషేకం


గోకవరంలో కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: స్థానిక రమాసత్యనారాయణస్వామి ఆలయంలో మహాకుంభాభిషేకం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు ఆరవిల్లి సీతారామాచార్యులు, వల్లూరి జగన్నాథశర్మ ఉదయం విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు, పద్మావతీదేవి దంపతులతో అష్టోత్తర కలశపూజ నిర్వహించారు. అనంతరం వందలాది మంది భక్తులు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు కలశాలతో ఆలయానికి చేరుకోగా పండితులు శిఖరాలకు మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ హిందూ దేవాలయాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. దీనిలో భాగంగా రూ.35 లక్షలతో ఆలయ శిఖర పునఃప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం నిర్వహించినట్టు తెలిపారు. ఈ పూజాది కార్యక్రమాల ముగింపును పురస్కరించుకుని శుక్రవారం భారీ అన్నదానం ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

ఏలేరులో తగ్గుతున్న నీటినిల్వలు


ఏలేరులో ప్రస్తుత నీటి నిల్వలు

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గుతున్నాయి. ప్రస్తుత వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో పాటు ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి సరాఫరా పెరగడంతో నీటి నిల్వలు అడుగంటుతున్నాయి. జలాశయంలో గురువారం నాటికి 86.56 మీటర్లకు గాను 71.42 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 5.34 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. దిగువ ఆయకట్టుకు 500, విశాఖకు 100, పంపాకు 30 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి


అప్పలరాజుపేటలో వృద్ధురాలితో మాట్లాడుతున్న శంకర్ మల్లిక్

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- అప్పలరాజుపేటలో ఎన్నికల ప్రచారం

కోటనందూరు: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ కోరారు. మండలంలోని అప్పలరాజుపేటలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ నల్లమిల్లి సూర్యకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, తుని నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న తన తండ్రి దాడిశెట్టి రాజాను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం


కత్తిపూడిలో వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికుడు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. మండలంలోని కత్తిపూడిలో గురువారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

మల్లిసాలలో 37 మద్యం బాటిళ్ల స్వాధీనం

జగ్గంపేట: మండలంలోని మల్లిసాలలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న దుకాణంపై జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు గురువారం రాత్రి దాడి చేశారు. ఈ దాడిలో 37 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు పెరిమర్ని రాజు అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


వేలంకలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

కిర్లంపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, ఎస్సై షేక్ జబీర్ కోరారు. ఎన్నికల నేపథ్యంలో మండలంలోని వేలంకలో గురువారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించి ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా రాత్రికి వేలంకలోనే బస చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సత్యనారాయణ, ఏఎస్సై బలరాం, ఏఎస్సై కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌వీ రమణ, సెక్రటరీ ఆర్ వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

బాషాకు సత్కారం


బాషాను సత్కరించిన రైల్వే ఉద్యోగులు

సామర్లకోట: స్థానిక రైల్వే పార్శిల్ కార్యాలయ ఉద్యోగి బాషాను గురువారం పలువురు రైల్వే అధికారులు అభినందించి సత్కరించారు. బుధవారం స్థానిక ప్లాట్‌ఫాంపై ఉన్న వృద్ధుని విషయంలో ఔదార్యం చూపడంపై ఆయనను సత్కరించారు. స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ బి.శ్రీధర్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ నారాయణరావు బాషాను అభినందించారు.